10 YEAR ANNIVERSARY 2014 - 2024

# పెన్ పవర్

తెలంగాణ రౌండప్

గురువారం 28 నవంబర్ 2024 పేజీలు 8



బాచుపల్లిలో ఓసీ లేని తప్పుడు భవనంలో టకీలా పబ్..


# నిన్నటిదాకా ఎడ్యుకేషన్ హబ్..! ఇప్పుడు డ్రగ్స్ హబ్‌గా రూపాంతరం..!

## నిజాంపేట్ మున్సిపల్ కార్పోరేషన్‌లో అనుమతుల్లేని "టకీలా"-"గోల్డెన్ బ్యారెల్" పబ్‌లు..

- మేడ్చల్ జిల్లా బాచుపల్లిలో యువతను పెడదారి పట్టించే "పబ్" కల్చర్‌పై ఆందోళన వ్యక్తం..
- అక్రమ "పబ్‌ల" నిర్వహణలో..! "ఆమ్యామ్యాలకే" అధికారుల ప్రాధాన్యత..?
- విద్యాసంస్థలకు దూరంగా ఉండాల్సిన "పబ్" కల్చర్..! విద్యార్థుల కోసమే అన్నట్లు ఏర్పాటు..!!
- ఇప్పటికే విచ్చలవిడిగా అక్రమ గంజాయి రవాణాతో అట్టుడికి పోతున్న హైదరాబాద్ మహానగరం..
- బాచుపల్లిలో ఎలాంటి అనుమతుల్లేని "పబ్" కల్చర్ ప్రోత్సాహం సరైనదేనా..?
- విద్యార్థుల హబ్‌గా ఉన్న బాచుపల్లి.. డ్రగ్స్ హబ్‌గా మారబోతోందన్న సామాజిక వేత్తలు..

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, నవంబర్ 27:** చట్టాలను బాధ్యతతో అమలు చేయాల్సిన వివిధ శాఖలకు చెందిన అధికారులు.. నిబంధనలను కూడా కాలారస్తూ..! చట్టవ్యతిరేక కార్యకలాపాలకే అధికార యంత్రాంగం ప్రాధాన్యత ఇవ్వడం ప్రజల్లో ఆందోళన కలిగిస్తుంది.. తెలంగాణ పరిసర రాష్ట్రాల నుండి గంజాయి సంబంధిత మాదకద్రవ్యాల రవాణాను అరికట్టడానికి పోలీస్ యంత్రాంగం విశ్వప్రయత్నం చేస్తున్న తరుణంలో.. బాచుపల్లిలో ఎలాంటి అనుమతులు లేకుండా ప్రారంభించిన "టకీలా పబ్"-గోల్డెన్ బ్యారెల్" పబ్‌ల నిర్వహకులపై చర్యలు చర్యలు చేపట్టకపోవడం బాధాకరం.. విద్యావంతులైన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌ల ఆధ్వర్యంలో "టకీలా పబ్" నిర్వహణ.. రాజకీయ నేతలు, బిల్డర్‌లు కలిసి "గోల్డెన్ బ్యారెల్" పబ్ నిర్వహణ.. యువతను లక్ష్యంగా వ్యాపారం చేస్తున్న పబ్‌లను తక్షణమే తొలగించాలని స్థానికుల ఫిర్యాదులను..! ఎక్సైజ్ కమిషనర్, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, జిల్లా కలెక్టర్, సంబంధిత శాఖల అధికారులు లెక్కచేయక పోవడం బాధాకరం..

-2లో






బాచుపల్లిలో ఓ అక్రమ షెడ్డులో.. "గోల్డెన్ బ్యారెల్" పబ్"..

# హైదరాబాద్‌లోని అన్ని చెరువులపై పర్యవేక్షణ మాదే




- ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లను నిర్ధారించే వరకు పర్యవేక్షణ తమదేనన్న హైకోర్టు
- ఇప్పటి వరకు పలు చెరువులకు నోటిఫికేషన్లు జారీ చేశామన్న హెచ్‌ఎండీఏ
- తదుపరి విచారణ డిసెంబర్ 30కి వాయిదా వేసిన హైకోర్టు

-3 లో

# ప్రశ్నిస్తే నీ డీఎన్ఏ ఏమిటని మాట్లాడుతున్నారు

- ఏడాది పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం సాధించింది ఏమీ లేదన్న కిషన్ రెడ్డి
- తన డీఎన్ఏ బీజేపీ అని వ్యాఖ్య
- రాష్ట్రంలో రాజకీయ వ్యవస్థ భ్రష్టుపడుతోందని ఆవేదన

-3 లో



# నిన్నటిదాకా ఎడ్యుకేషన్ హబ్..! ఇప్పుడు డ్రగ్స్ హబ్‌గా రూపాంతరం..!








- మొదటి పేజి తరువాయి

యువతను పెడదారి పట్టించే "పబ్ కల్చర్"ను తక్షణమే తొలగించాలని సామాజిక కార్యకర్తలు, రాజకీయ నాయకులు, ప్రజలు డిమాండ్ చేస్తున్నారు..

యువత భవిష్యత్తు ఆశయాలను, చిన్నాభిన్నం చేసే వ్యాపారాత్మక పబ్ కల్చర్‌ని బాచుపల్లిలో పూర్తిగా రద్దు చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.. మాదకద్రవ్యాలపై నిఘా ఏర్పాటు చేసిన ప్రభుత్వం అక్రమ పబ్‌లను ప్రోత్సహించడం పలు అనుమానాలకు తావిస్తోంది.. మరోవైపు స్థానిక నేతల సిఫార్సులు లేకుండా పబ్‌ల నిర్వహణ సాధ్యం కాదని విమర్శింస్తున్నారు.. ఓవైపు యువత మత్తుపదార్థాలకి బానిసలుగా మారుతున్నారు.. పేరెంట్స్ ర్యాలీలు, నిరసనలు తెలిపినా, ప్రభుత్వాల చర్యలు తాత్కాలికంగానే

ఉంటున్నాయి.. ప్రజల వ్యతిరేకతకి గురికాకుండా, ఒకటి రెండు పబ్‌లపై దాడులు నిర్వహించి చేతులు దులుపుకుంటున్నారనే విమర్శలు లేకపోలేదు.. కాస్త పలుకుబడి ఉన్నవారు ఇలా నగర శివారు ప్రాంతాలకు పబ్ కల్చర్‌ను పరిచయం చేస్తున్నారు.. బాచుపల్లి " టకీలా పబ్" అండ్ "గోల్డెన్ బ్యారెల్" పబ్‌లపై ఫిర్యాదులు వెల్లువెత్తినా నియంత్రణ చర్యలు సిఫార్సులతో సమసి పోతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.. ఎక్సైజ్ శాఖ తప్పుడు అనుమతులు జారీ చేయడంపై సర్వత్రా ఆరోపణలు వస్తున్నాయి.. ఈ పబ్ కల్చర్ తమ కార్పొరేషన్‌లో వద్దంటూ నిరసనలు తెలియజేస్తున్నారు.. కేవలం ట్రేడ్ లైసెన్స్‌కి దరఖాస్తు చేసుకున్న రసీదుతోనే ఎక్సైజ్ కమిషనర్ గుడ్డిగా అనుమతులు జారీ చేయడం గమనార్హం..

## భవనం అక్రమమే..! "టకీలా పబ్" అక్రమమే..!

బాచుపల్లి "టకీలా పబ్"కి సరైన అనుమతులు లేవని ఆరోపణలు ఉండగా..? "పబ్" నిర్వహిస్తున్న భవనం కూడా తప్పుడు నిర్మాణం అంటూ ఆకుల సతీష్ ఆరోపించారు.. అక్రమ పబ్‌ను తక్షణమే సీజ్ చేయాలని అసయన డిమాండ్ చేశారు.. మాదకద్రవ్యాలకి, చెడువ్యసనాలకు, నిలయమైన పబ్ కల్చర్‌ను కుత్బుల్లాపూర్, బాచుపల్లి నుండి తరికొట్టాలని హెచ్చరించారు.. వెంటనే చర్యలు తీసుకోవాలని కార్పొరేషన్ మేనేజర్‌కి ఫిర్యాదు చేసినా నేటికీ చర్యలు శూన్యం.. సర్వే నెంబర్ 57, ప్లాట్ నెంబర్ 61/P, బాచుపల్లి మెయిన్ రోడ్డులో హెచ్ఎండిఏ (019474/MED/R1/U6/HMDA/23012019) 5 G+5 , ఇంటి నిర్మాణ అనుమతులు తీసుకొని కమర్షియల్ కట్టడాలు చేపట్టడమే గాక..! నిబంధనలకు విరుద్ధంగా చట్ట వ్యతిరేక కార్యకలాపాలను ప్రోత్సహించే "పబ్‌ల" నిర్వహణకు పాల్పడుతున్నారు..! బిల్డింగ్‌కి "ఆక్యుపెన్సీ సర్టిఫికేట్ తీసుకోకుండానే.. వ్యాపారాత్మక రెస్టారెంట్‌తో పాటు, పబ్ నిర్వహిస్తుండటంపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.. హెచ్ఎండిఏ,లోకల్‌బాడీ అధికారులు సైతం మామూళ్ళ మత్తులో, పర్యవేక్షణ లేమితో తప్పుడు భవనాలపై చర్యలు విస్మరించడం విశేషం.. నిబంధనలకు ప్రకారం హెచ్ఎండిఏ అనుమతులు ఇంటి నిర్మాణానికి ఇచ్చారు.. కానీ కమర్షియల్ కోసం అక్రమంగా నిర్మించడమే కాకుండా, ఆక్యుపెన్సీ సర్టిఫికేట్ పొందకుండానే సదరు బిల్డింగ్ వ్యాపారానికి లీజుకి ఇవ్వడం గమనార్హం..

## అక్రమ షెడ్డులో "గోల్డెన్ బ్యారెల్ "పబ్" నిర్వహణ..

బాచుపల్లిలోని అక్రమ "పబ్‌ల నిర్వహణ" ప్రధానంగా అధికారుల అండతోనే నిర్వహిస్తున్నారని స్పష్టమవుతుంది.. ఎలాంటి అనుమతులు లేని ఒక అక్రమ షెడ్డులో "గోల్డెన్ బ్యారెల్" పబ్" నిర్వహిస్తున్నారు.. హెచ్ఎండిఏ, మున్సిపాలిటీలు నేతల. సిఫార్సులతో చర్యలు చేపట్టలేని స్థితిలో విధులు నిర్వహిస్తున్నారు.. ముఖ్యంగా యువతను మాదకద్రవ్యాల

వైపు మళ్ళించే ప్రమాదకర పబ్‌లను ఏరివేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం బాచుపల్లి పబ్‌లపై దృష్టి సారించకపోవడం బాధాకరం.. హైదరాబాద్ శివారు బాచుపల్లిలో ఎలాంటి అనుమతులు లేకుండా, నూతన పబ్‌లను ప్రారంభిస్తుంటే..! సంబంధిత అధికారులు బాధ్యతా రహితంగా వ్యవహరించడం పలువురిని ఆందోళన కలిగిస్తుంది.. ఆడ,మగ తేడా లేకుండా యువత పబ్ కల్చర్‌కి అలవాటు పడి జీవితాలు నాశనం చేసుకుంటున్న నేపథ్యంలో.. పోటీపడి నూతనంగా "పబ్‌లు" ప్రారంభించడం స్థానికులకి సవాల్‌గా మారాయి.. ఎలాంటి అనుమతులు లేని "గోల్డెన్ బ్యారెల్" పబ్‌ని ప్రారంభించడం విశేషం.. గతంలో బార్ అండ్ ఫ్యామిలీ రెస్టారెంట్‌గా ఉన్న గోల్డెన్ బ్యారెల్‌లో అదనంగా "పబ్" జోడించారు.. కేవలం విద్యార్థులను టార్గెట్ చేసి పబ్ నిర్వాహకులు వ్యాపారం చేస్తున్నారనే విమర్శలూ లేక పోలేదు..

# సామాజిక-రాజకీయ వేత్తల విమర్శలు..

పబ్‌ల మాటున, మాదకద్రవ్యాల వాడకంతో నేరాలకు పాల్పడే అవకాశాలు ఉన్నాయని నిజాంపేట్ బీజేపీ మాజీ అధ్యక్షుడు ఆకుల సతీష్, "ఇండియా ఎగైనెస్ట్ డ్రగ్స్" కో–కన్వీనర్ మధుబాబు చికిలే పేర్కొన్నారు.. ఇప్పటివరకు విద్యార్థుల హబ్‌గా ఉన్న బాచుపల్లి, ఇప్పుడు డ్రగ్స్ హబ్‌గా రూపాంతరం చెందిందని ఎద్దేవా చేశారు.. నగరంలో పబ్ కల్చర్ ఆందోళనకు గురి చేస్తుండగా..! ఇప్పుడు ఆ విష సంస్కృతి శివారు ప్రాంతాలకు విస్తరించడం శోచనీయం.. యువత డ్రగ్స్‌కి బానిసలుగా మారుతున్న నేటి పరిస్థితుల్లో ప్రభుత్వం కఠిన నిర్ణయాలు తీసుకోక పోతే..! మనం చూస్తుండగానే యువత నిర్వీర్యమై పోతుందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.. ముఖ్యంగా విద్యార్థుల హబ్‌గా ఉన్న బాచుపల్లి డ్రగ్స్‌కు హబ్‌గా మారే పరిస్థితి దారుణమని "సిటిజన్స్ సోషల్ రెస్పాన్సిబిలిటీ" (సిఎస్ఆర్) సభ్యులు మధుబాబు చికిలే పేర్కొన్నారు.. సంబంధిత ప్రభుత్వ శాఖలు అలసత్వం ప్రదర్శించకుండా..!అటు భవన నిర్మాణ అనుమతులు, ఇటు పబ్‌ల నిర్వహణకు అనుమతులపై పూర్తి దర్యాప్తు చేసి విష సంస్కృతికి వీడ్కోలు పలకాలని కోరారు.. విద్యా సంస్థలకు దూరంగా ఉండేలా చూసుకోవాలని, అసలు నగరు శివారు ప్రాంతాలకు పబ్ అనుమతులు నిరాకరించడం మంచిదని ఆకుల సతీష్, మధుబాబు చికిలే సూచించారు.. నగరం నడిబొడ్డు నుండి శివారుకి పాకిన "పబ్ కల్చర్" ఇక్కడ నుండి పల్లెలకు కూడ విస్తరించే అవకాశం లేకపోలేదని అన్నారు.. ఇది ఇలాగే కొనసాగితే మరో



ఆకుల సతీష్.. రాజకీయ వేత్త..



సామాజిక వేత్త మధుబాబు చికిలే..

పంజాబ్ తయారు అవుతుందని హెచ్చరించారు.. యువత భవితవ్వాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిది.. అంటూ బాచుపల్లి "పబ్‌లపై తక్షణ చర్యలకు ఆదేశించాలని సామాజిక వేత్తలు కోరుతున్నారు.

# ఢిల్లీకి ఎందుకు? హాట్ టాపిక్‌గా బీజేపీ ఎమ్మెల్యేల హస్తిన టూర్

- రాష్ట్ర అధ్యక్షుడి నియామకంపై చర్చిస్తారా?
- 'మహా' ఫలితాలు రాగానే ఈ భేటీ ఎందుకు?
- పొత్తు అంశాలపై మాట్లాడేందుకు పిలిచారా?
- అంతర్గత విభేధాలపై డిస్కస్ చేస్తారా..?
- ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, ఎంపీల పర్యటనపై ఆసక్తికర చర్చ
- ప్రధాని నరేంద్ర మోదీ దిశానిర్దేశంపై చర్చ




హైదరాబాద్ పెన్ పవర్:బీజేపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, ఎంపీలు హస్తిన బాట పట్టడం హాట్ టాపిక్‌గా మారింది. అందరినీ ఏక బిగిన ఢిల్లీకి పిలిచి ఏం చర్చించబోతున్నా రనేది ఆసక్తికరంగా మారింది. ఇదిలా ఉండగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ప్రస్తుతం కిషన్ రెడ్డి కొనసాగుతు న్నారు. ఆయన స్థానంలో వేరొకరిని నియమించాల్సి ఉంది. ఈ స్థానం కోసం డీకే అరుణ, రఘునందన్ రావు, ఈటల, అర్వింద్ పోటీపడుతున్నట్టు ప్రచారంలో ఉంది. అయితే ఎవరిని నియమించాలనే అంశంపై ఏకాభిప్రాయం కోసం వీళ్లను పిలిచి ఉంటారా..? అనే చర్చ కూడా నడుస్తోంది. ఇదిలా ఉండగా.. సంకీర్ణ ప్రభుత్వాలే ఏర్పడుతున్న ప్రస్తుత తరుణంలో తెలంగాణలో పొత్తుల అంశంపై చర్చించేందుకు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పిలిచారా..? అనే చర్చ నడుస్తోంది.మహారాష్ట్ర ఎన్నికల్లో సానుకూల ఫలితాలు రావడంతో బీజేపీ అధినాయకత్వం రంగంలోకి దిగడం హాట్ టాపక్ గా మారింది. సంకీర్ణాలతో ముందుకు పోవాలని భావిస్తే బీజేపీ, బీఆర్ఎస్ మధ్య పొత్తు ఉంటుందా? అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఉప్పు నిప్పులా మెదిగిలిన రెండు పార్టీలు.. క్రమంగా చేరువవుతున్నాయనే వాదన ఉంది. ఈ విషయాలను చర్చించేందుకు ఢిల్లీకి పిలిచినట్టు కూడా మరో వైపు చర్చ సాగుతోంది. రాష్ట్ర బీజేపీలో గత కొంత కాలంగా సమన్వయం కొరవడింది. క్రమశిక్షణకు మారుపేరుగా చెప్పుకొంటున్న కాషాయపార్టీ గాడి తప్పుతోందని పత్రికల్లో, టీవీల్లో కథనాలు వస్తున్నాయి. వాటిని చక్కదిద్దే విషయాన్ని కూడా అధినాయకత్వం మాట్లాడుతుందనే వాదన ఉంది.

**తెలంగాణలో వ్యూహమేంటి..?**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తవుతోంది. వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి రావాలంటే ఏం చేయాలి..? ఎలా ముందుకు వెళ్లాలి.. ఎవరిని కలుపుకొని వెళ్లాలి.. ప్లస్ ఏంటి..? మైనస్ ఏంటి..? అనే అంశాపై దిశానిర్దేశం చేసేందుకు పిలిచారనీ అంటున్నారు. ఎలాంటి స్టాండ్ తీసుకోవాలి..? మిత్రులెవరు..? శత్రులెవరు..? అనే దానిపై ఈ సమావేశంలో అధినాయకత్వం క్లారిటీ ఇస్తుందనే చర్చ ఉంది.

**వార్నింగ్ ఇస్తుందా..?**

తెలంగాణ బీజేపీలో లుకలుకలున్నాయనేది బహిరంగ రహస్యం. ముఖ్యంగా ఎమ్మెల్యేలు, ఎంపీల మధ్య సమన్వయం కొరవడింది. నేతల మధ్య చాలా గ్యాప్ ఉంది. గత కొంత కాలంగా ఎంపీ ఎమ్మెల్యేలు వ్యవహరిస్తున్న తీరుపై నివేదికలు తెప్పించుకున్న అధినాయకత్వం స్వయంగా రంగంలోకి దిగిందని తెలుస్తోంది. పార్టీలో క్రమశిక్షణ గాడి తప్పుతుండటంతో అందరినీ కూర్చోబెట్టి క్లాస్ ఇస్తుందని తెలుస్తోంది. గీత దాటిన వారికి సీరియస్ వార్నింగ్ ఇచ్చేందుకు డైరెక్టుగా ప్రధాని నరేంద్ర మోదీయే రంగంలోకి దిగారని తెలుస్తోంది.

# తప్పు ఒప్పుకొని వెనక్కి తగ్గినంత మాత్రాన రేవంత్ రెడ్డి కిరీటం పడిపోదు: కేటీఆర్

- దిలావర్‌పూర్‌లో దిగొచ్చినట్లుగానే లగచర్లలోనూ లెంపలేసుకోవాలన్న కేటీఆర్
- అమాయకుల భూములను దొంగచాటుగా లాక్కునే కుట్రలకు తెరదించాలన్న స్పష్టీకరణ
- సంఘటన శక్తిలో ఉన్న బలం ముందు ప్రధాని కూడా వెనక్కి తగ్గిన చరిత్ర ఉందని వెల్లడి





హైదరాబాద్ పెన్ పవర్:తప్పు ఒప్పుకొని వెనక్కి తగ్గినంత మాత్రాన రేవంత్ రెడ్డి కిరీటం ఏమీ పడిపోదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. దిలావర్‌పూర్‌లో రైతుల దెబ్బకు దిగొచ్చిన రేవంత్ రెడ్డి లగచర్లలోనూ లెంపలేసుకోవాలని సూచించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు.వెంటనే లగచర్లలో... అల్లుడి కోసం... అదానీ కోసం... ఇండస్ట్రియల్ కారిడార్ ముసుగులో పెడుతున్న ఫార్మా, సిమెంట్ ఫ్యాక్టరీల ప్రతిపాదనలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అమాయకులైన గిరిజనుల భూములను దొంగచాటుగా బలవంతంగా 'లాక్కునే కుట్రలకు ఇప్పటికైనా తెరదించాలని పేర్కొన్నారు. అక్కడ శాంతిని నెలకొల్పాల్సి ఉందన్నారు.ఢిల్లీలో రైతుల సంఘటన శక్తిలో ఉన్న బలం ముందు దేశ ప్రధాని కూడా చివరికి వెనక్కి తగ్గిన చరిత్ర మన కళ్ళ ముందు ఉందని కేటీఆర్ రాసుకొచ్చారు. అనాలోచిత నిర్ణయాలతో మొన్న లగచర్లలో లడాయికి కారణమైన రేవంత్ రెడ్డి.. తన మొండి వైఖరి వల్లే నిన్న నిర్మల్‌లో ఇథనాల్ మంటలను రాజేశారని ఆరోపించారు. తలకు మాసిన ఆలోచనలతో రేపు రేవంత్ ఏ జిల్లాలోని... ఏ పచ్చని పంట పొలాల్లో ఎలాంటి బాంబు పేలుస్తారోననే భయం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రైతులందరిలో వ్యక్తమవుతోందన్నారు. ప్రజల అభీష్టం మేరకు నడుచుకోవడం... వారి మనోభావాలను గౌరవించడమనేది పాలకుడి ప్రాథమిక విధి అని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని గుర్తెరిగి వెంటనే నిర్మల్ తరహాలోనే... సొంత నియోజకవర్గంలో లగచర్ల సమరానికి ఫుల్ స్టాప్ పెట్టాలని హితవు పలికారు. లేదంటే జరిగే పరిణామాలకు సీఎం బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

# హైదరాబాద్‌లోని అన్ని చెరువులపై పర్యవేక్షణ మాదే

హైదరాబాద్ పెన్ పవర్:హెచ్ఎండీఏ పరిధిలోని చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లను నిర్ధారించే వరకు హైదరాబాద్‌లోని చెరువుల పర్యవేక్షణ బాధ్యత తమదేనని తెలంగాణ హైకోర్టు స్పష్టం చేసింది. నగరంలోని అన్ని చెరువుల పర్యవేక్షణ తమదేనని తెలిపింది. రామమ్మ చెరువు బఫర్ జోన్‌లో నిర్మాణాలు జరగకుండా చూడాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై ఈరోజు హైకోర్టులో విచారణ జరిగింది.

మరోవైపు, హెచ్ఎండీఏ పరిధిలో 3,532 చెరువులు ఉన్నాయని గత జులైలో విచారణ సందర్భంగా ప్రభుత్వం తెలిపింది. వాటికి బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్‌ను నిర్ధారించాలని హైకోర్టు ఆదేశించింది.ఈరోజు రామమ్మ చెరువు బఫర్ జోన్‌పై విచారణ సందర్భంగా హెచ్ఎండీఏ కమిషనర్ విచారణకు హాజరయ్యారు. ఇప్పటి వరకు 2,793 చెరువులకు ప్రాథమిక నోటిఫికేషన్లు జారీ చేశామని, 530 చెరువులకు తుది నోటిఫికేషన్లు జారీ అయ్యాయని తెలిపారు. తదుపరి విచారణను డిసెంబర్ 30కి వాయిదా వేసింది. ఆ లోగా నివేదిక ఇవ్వాలని ఆదేశించింది.

# ప్రశ్నిస్తే నీ డీఎన్ఏ ఏమిటని మాట్లాడుతున్నారు

హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణలో ఏడాది పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం సాధించింది ఏమీ లేదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. బెదిరింపులు, తిట్ల పురాణాలు తప్ప ఏమీ సాధించలేదని అన్నారు. సమస్యలపై మాట్లాడితే నీ డీఎన్ఏ ఏమిటని మాట్లాడుతున్నారని... తన డీఎన్ఏ భారతీయ జనతా పార్టీ అని చెప్పారు. మిగిలిన వారి మాదిరి 10 పార్టీలు మారిన డీఎన్ఏ తనది కాదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను డిసెంబర్ 1 నుంచి 5 వరకు ప్రజలకు వివరిస్తామని తెలిపారు. రాజకీయ పార్టీల ఆరోపణలు, ప్రత్యారోపణలతో రాష్ట్రం నష్టపోతుందని చెప్పారు. రాష్ట్రంలో రాజకీయ వ్యవస్థ భ్రష్టుపడుతోందని... కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ ఒకటేనని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా నిర్మాణాత్మక పాలనపై దృష్టి సారించాలని హితవు పలికారు.

## లిమిట్‌ను మించి మీ క్రెడిట్ కార్డు వాడుకోవచ్చు..ఎలా అంటే..




**హైదరాబాద్ పెన్ పవర్:**సాధారణంగా క్రెడిట్ కార్డు ఉన్నవాళ్లు..ఇచ్చిన లిమిట్‌లో షాపింగ్ చేయొచ్చు.. పెట్రోల్ కొట్టించుకోవచ్చు.. మొబైల్ కొనుక్కోవచ్చు.. ఇలా అనేక రకాలుగా క్రెడిట్ కార్డును వినియోగించుకోవచ్చు. ఇదంతా ఇచ్చిన క్రెడిట్ లిమిట్ లోనే చేయాలి. అయితే ఇక్కడ మరో గ్రేట్ ఆప్షన్ కూడా ఉంది. అదేంటంటే.. మనకు క్రెడిట్ కార్డులపై ఇచ్చిన క్రెడిట్ లిమిట్ కంటే ఎక్కువగా కూడా వినియోగించుకోవచ్చు.. అదే ఓవర్ డ్రాఫ్ట్ లిమిట్ ఆప్షన్.. ఇది ఎలా పనిచేస్తుందో తెలుసుకుందాం.. ప్రతి క్రెడిట్ కార్డును వినియోగించేందుకు ఓ క్రెడిట్ లిమిట్ ను కలిగి ఉంటుంది. ఉదాహరణకు రూ. 10 లక్షల లిమిట్ ఉందనుకోండి. పది లక్షల వరకు మనం ఖర్చు చేయొచ్చు. కానీ మనకు అంతకంటే ఎక్కువగా అవసరం పడితే.. అంటే 12 లక్షలు అవసరం ఉంటే కూడా ఖర్చు చేయొచ్చు. అంటే మనకు ఇచ్చిన లిమిట్ కంటే ఎక్కువగా కూడా వాడుకోవచ్చు. క్రెడిట్ కార్డుపై ఇచ్చిన లిమిట్ కంటే ఎక్కువగా వినియోగించాలంటే ఓవర్ డ్రాఫ్ట్ లిమిట్ ఆప్షన్ ఏనేబుల్ ద్వారా ఇచ్చిన క్రెడిట్ లిమిట్ కంటే ఎక్కువగా వినియోగిం చుకునే ఛాన్స్ ఉంది. క్రెడిట్ కార్డుపై ఇచ్చిన లిమిట్ కంటే ఎక్కువగా వినియోగించుకోవాలంటే.. కొన్ని నియమాలున్నాయి. ఇందుకోసం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా షరతులు విధించింది. ఇంటర్నెట్, మొబైల్ బ్యాంకింగ్ ద్వారా కార్డ్-జారీదారు ప్లాట్‌ఫారమ్‌లలో transaction control mechanism ద్వారా ఓవర్ డ్రాఫ్ లిమిట్ ఆప్షన్ ను ఎనేబుల్, డిసేబుల్ చేసుకునేందుకు కార్డ్ హోల్డర్‌కు అనుమతినిచ్చింది. రిజర్వ్ బ్యాంక్ మార్చి 7, 2024 రూల్స్ ప్రకారం.. ఓవర్‌లిమిట్ సౌకర్యం కోసం కార్డ్ హోల్డర్ నుండి స్పష్టమైన సమ్మతి పొందకపోతే, ఓవర్‌లిమిట్ అందించబడదు లేదా ఓవర్‌లిమిట్ ఛార్జీలు విధించబడతాయి.

## కన్నతల్లిని స్మశానంలో వదిలేసిన కొడుకులు.. జగిత్యాలలో దారుణం



**హైదరాబాద్ పెన్ పవర్:**జన్మనిచ్చిన కన్నతల్లిని స్మశానంలో వదిలేసిన కొడుకుల నిర్వాకం జగిత్యాల పట్టణంలో వెలుగుచూసింది. గత ఎనిమిది రోజులుగా స్మశాన వాటికలోనే వృద్ధురాలు రాజవ్వ గడిపింది. జగిత్యాల పట్టణ మోతె స్మశాన వాటికలో వృద్ధురాలు కనిపించింది. పింఛన్ పైసల కోసం తల్లిని కుమారుడు చితకబాదాడు. పింఛన్ డబ్బులు ఇవ్వకపోవడంతో తాగుడుకు బానిసైన ఓ కొడుకు నెట్టి వేయడంతో వృద్ధురాలు రాజవ్వ కాలు విరిగింది. విరిగిన కాలు, అచేతన స్థితిలో రాజవ్వ స్మశానంలో బిక్కుబిక్కుమంటూ గడుపుతోంది. నలుగురు కొడుకులున్నా లాభం లేదని రాజవ్వ రోదించింది.సంక్షేమశాఖ అధికారులకు సమాచారం ఇవ్వగా ఆమెను ఆస్పత్రికి తరలించారు. వయోవృద్ధుల చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని సంక్షేమ శాఖ అధికారి నరేష్ తెలిపారు.

# అదానీ దేశం పరువు తీస్తే... జగన్ రాష్ట్ర పరువు తీశారు: షర్మిల

రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ను కలిసిన షర్మిల

జగన్-అదానీ విద్యుత్ డీల్ పై విచారణ చేయించాలని విజ్ఞప్తి

డీల్ రద్దు చేయాలని డిమాండ్





**హైదరాబాద్ పెన్ పవర్:**ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల నేడు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ను కలిసి జగన్-అదానీ విద్యుత్ డీల్ పై వినతి పత్రం అందించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన విద్యుత్ కొనుగోళ్లు, రూ.1,750 కోట్ల ముడుపుల వ్యవహారంపై విచారణ జరిపించే విధంగా ఆదేశాలు ఇవ్వాలని గవర్నర్ ను కోరారు. ఈ విద్యుత్ డీల్... అదానీకి లాభం-రాష్ట్ర ప్రజలకు పెనుభారం అని షర్మిల అభివర్ణించారు. ప్రపంచం మొత్తం ఈ ముడుపుల గురించే చర్చించుకుంటోందని, అంతర్జాతీయ స్థాయిలో రాష్ట్రం పరువుపోయిందని షర్మిల పేర్కొన్నారు. అదానీ దేశం పరువు తీస్తే, జగన్ రాష్ట్ర పరువు తీశారని విమర్శించారు. ఈ స్కాంపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) వేయాలని జాతీయ కాంగ్రెస్ కోరిందని, రాష్ట్రంలో కూడా దీనిపై దర్యాప్తు చేయాలని, అదానీతో ఒప్పందాన్ని రద్దు చేయాలని ఏపీసీసీ డిమాండ్ చేస్తోందని షర్మిల స్పష్టం చేశారు. “ఒక యూనిట్ రూ.1.99కి లభ్యమయ్యే విద్యుత్ ను రూ.2.49కి కొనుగోలు చేశారు. ఈ ధరకు అన్ని చార్జీలు కలిపితే ఒక యూనిట్ విద్యుత్ ధర రూ.5 దాటిపోతుంది. ఈ ధర ప్రకారం పాతికేళ్లకు ఒప్పందం కుదుర్చుకున్నారంటే... ఈ తరాన్ని మాత్రమే కాదు, రాబోయే తరాన్ని కూడా తాకట్టు పెట్టినట్టే... లక్షల కోట్ల ప్రజల సొమ్మును అదానీకి దోచిపెట్టినట్టే! ఇదో పెద్ద స్కాం అంటూ నాడు విపక్షంలో ఉన్న టీడీపీ ఆందోళనలు కూడా చేసింది. ఆ ఒప్పందాలు రద్దు చేయాలని డిమాండ్ చేసింది. కానీ, ఇప్పుడు అధికారంలోకి వచ్చాక మాత్రం టీడీపీ ఆ డీల్ గురించి మౌనం దాల్చింది. జగన్-అదానీ డీల్ పై ఎందుకు సైలెంట్ అయ్యారని చంద్రబాబును అడుగుతున్నా. ఎవరికి భయపడుతున్నారు... అదానీకా, మోదీకా? చర్యలకు ఎందుకు వెనుకంజ వేస్తున్నారు? అదానీతో ఏమైనా ములాఖత్ అయ్యారా?” అంటూ షర్మిల ప్రశ్నించారు.

# అదానీకి రూ.100 కోట్లు తిరిగిచ్చిన రేవంత్ రెడ్డి ఆ కాంట్రాక్టర్‌కు ఎందుకివ్వలేదు?: బీజేపీ నేత ప్రభాకర్

కాళేశ్వరం కొట్టుకుపోవడానికి కారణమైన వారి విరాళం ఎందుకు తిరిగివ్వలేదని ప్రశ్న

కేసీఆర్, రేవంత్ రెడ్డిలు రాహుల్ గాంధీకి కుడి, ఎడమ కన్ను వంటి వారని ఎద్దేవా

బీఆర్ఎస్ లాగే కాంగ్రెస్ పరిపాలన సాగుతోందన్న ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్



**హైదరాబాద్ పెన్ పవర్:**స్కిల్ యూనివర్సిటీకి అదానీ ఇచ్చిన రూ.100 కోట్లను తిరిగిచ్చిన తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి... కాళేశ్వరం ప్రాజెక్టు కొట్టుకుపోవడానికి కారణమైన కాంట్రాక్టర్ విరాళాన్ని ఎందుకు తిరిగివ్వలేదని బీజేపీ సీనియర్ నేత ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ ప్రశ్నించారు. కేసీఆర్, రేవంత్ రెడ్డిలు రాహుల్ గాంధీకి కుడి, ఎడమ కన్నులాంటి వారని విమర్శించారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ... కాంగ్రెస్ పాలన తీరు బీఆర్ఎస్ అడుగుజాడల్లో వెళ్తున్నట్లుగానే ఉందన్నారు. బీఆర్ఎస్ సకల జనుల సర్వే అంటే కాంగ్రెస్ సమగ్ర కుల సర్వే అంటోందన్నారు. రెండు ప్రభుత్వాలు రాష్ట్రాన్ని అప్పుల మయం చేస్తున్నాయని మండిపడ్డారు. బీఆర్ఎస్ లాగే కాంగ్రెస్ కూడా ఫిరాయింపులకు పాల్పడుతోందని విమర్శించారు.

బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల నాటకాలను తాము బట్టబయలు చేస్తామని హెచ్చరించారు. అక్రమ నిర్మాణం పేరిట అయ్యప్ప సొసైటీ కట్టడాలను కేసీఆర్ ప్రభుత్వం కూల్చేసిందని, ఇప్పుడు హైడ్రా పేరుతో కాంగ్రెస్ నిర్మాణాలు కూల్చేస్తోందన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితులను జైలుకు పంపుతామని కాంగ్రెస్ చెప్పిందని, కానీ అదేమీ జరగడం లేదన్నారు.ఆరు మోసాలు... అరవై ఆరు అబద్ధాలతో టైంపాస్ చేస్తామంటే కుదరదన్నారు. ఇందిరమ్మ రాజ్యం అంటే దోచుకోవడం... దాచుకోవడమేనా? అని నిలదీశారు. కాంగ్రెస్ పాలనలో అత్యాచారాలు, హత్యలు జరిగాయన్నారు. ఏడాది పాలనపై కాంగ్రెస్ ప్రభుత్వం బహిరంగ చర్చకు సిద్ధమా? అని సవాల్ విసిరారు.

# ఘట్కేసర్ పోలీస్ స్టేషన్ ముందు హోంగార్డ్ ఆత్మహత్యాయత్నం

**హైదరాబాద్ పెన్ పవర్:**చర్లపల్లికి చెందిన హోంగార్డ్ ఘట్కేసర్ పోలీస్ స్టేషన్ ముందే ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఘట్కేసర్ మున్సిపాలిటీలోని ఎదులాబాద్ లో సర్వేనెంబర్ 258, 268 లలో హోంగార్డు మహమ్మద్ గనికి 30 గుంటల భూమి ఉంది. భూమిని కబ్జా చేసేందుకు కొందరు హద్దురాళ్లు తొలగించారు. గని ఘట్కేసర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. మూడు రోజులు గడిచినా ఫిర్యాదు పట్టించుకోలేదని మహమ్మద్ గని పోలీస్ స్టేషన్ ముందే పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పోలీసులు అడ్డుకోవడంతో ప్రాణాపాయం తప్పింది. పోలీస్ అధికారులు హోంగార్డుకు కౌన్సిలింగ్ ఇచ్చి నచ్చజెప్పారు.



# బ్లాక్ ఫ్రైడే.. బ్లాక్ ఫ్రైడే సేల్స్ గురించి బాగా వినపడుతోంది.. ఇంతకీ బ్లాక్ ఫ్రైడే అంటే..?




**హైదరాబాద్ పెన్ పవర్:**ఇటీవల కాలంలో చాలా ఈ కామర్స్ సంస్థలు బ్లాక్ డే సేల్స్ నిర్వహిస్తున్నాయి. కస్టమర్లకు భారీ డిస్కౌంట్లు ప్రకటిస్తున్నాయి. తమ కావాల్సిన వస్తువులను జనాలు ఎగబడి కొంటున్నారు. దీంతో వ్యాపార సంస్థలకు లాభాలు వస్త్తున్నాయి..కస్టమర్లు వారికి నచ్చిన వస్తువులను కొనుక్కుంటున్నారు. ఇదంతా బాగానే ఉంది.. అయితే బ్లాక్ ఫ్రైడే సేల్స్ అంటే ఏందీ..ఈ సేల్స్ ఎప్పటినుంచి జరుపుతున్నారు..బ్లాక్ ఫ్రైడే సేల్స్ వెనక ఉన్న కథాకమామిషు ఏందో తెలుసుకుందాం..

అమెరికాలో ప్రతి ఏడాది థాంక్స్ గివింగ్ డేను నవంబర్ నెలలో చివరి గురువారం జరుపుకుంటారు. ఆ తరువాత రోజు అనగా నాలుగో శుక్రవారం బ్లాక్ ఫ్రైడే జరుపు కుంటారు. ఈ ఏడాది కూడా నవంబర్29 న బ్లాక్ ఫ్రైడే జరుపుకొనేందుకు సిద్దమవుతున్నారు. అమెరికా ప్రజలు బ్లాక్ ఫ్రైడే జరుపుకోవడం వెనక ఓపెద్ద కథే ఉంది..

థాంక్స్ గివింగ్ డే రోజున తమకు నచ్చిన వారికి లేదా తమ కుటుంబ సభ్యులు, తెలిసిన వారు, ఇతరులెవరైనా సరే.. వారికి బహుమతులను ఇచ్చి కృతజ్ఞతలు తెలుపుతుంటారు. తమ కోసం ఎదుటి వారు ఏదైనా పనిచేస్తే అందుకు ధన్యవాదాలు తెలుపుతూ వారికి గిఫ్టలను ఇస్తారు. అయితే ఆ రోజు తరువాతి రోజును బ్లాక్ ఫ్రైడేగా జరుపుకుంటారు. థాంక్స్ గివింగ్ డే రోజున వ్యాపార దుకాణాలు కళకళలాడుతాయి.కస్టమర్లను ఆకర్షించేందుకు వ్యాపారస్తులు అనేక ఆఫర్‌లు కూడా ప్రకటిస్తారు. ఈ రోజు వచ్చిన లాభ నష్టాలను బ్లాక్..రెడ్ ఎంట్రీలతో సూచిస్తారు. యూఎస్ మార్కెట్ నిపుణులు తెలిపిన వివరాల ప్రకారం థాంక్స్ గివింగ్ డే తరువాత అన్నీ బ్లాక్ ఎంట్రీలే ఉంటాయి. అంటే.. పెద్ద ఎత్తున లాభాలు వచ్చాయని అర్థం. అప్పటినుంచి బ్లాక్ ఫ్రైడేను నిర్వహిస్తున్నారు.

యునైటెడ్ స్టేట్స్‌లో, బ్లాక్ ఫ్రైడే రోజు షాపులు బిజీగా ఉంటాయి. ఈ ఆఫర్‌లు నవంబర్ నెల నాలుగో వారంలో సోమవారం నుంచి శుక్రవారం వరకు ఉంటాయి. దీనినే అమెరికాలో సైబర్ వీక్ అంటారు.

అమెరికాలో బ్లాక్ ఫ్రైడేను ఎందుకు జరుపుకుంటారో స్పష్టంగా తెలియకపోయినప్పటికీ..20వ శతాబ్దం మధ్యకాలంలో ఫిలడెల్ఫియాలో ప్రారంభమైందని తెలుస్తుంది. 1869 లో %ఖూ% గోల్డ్ మార్కెట్‌లో ఆర్థిక సంక్షోభం ఏర్పడిందని యూఎస్ మ్యాగ్జైన్ లో వచ్చిన కథనం ఆధారంగా తెలుస్తోంది. అప్పుడు గోల్డ్ వ్యాపారులు..సంక్షోభం నుంచి బయటపడేందుకు బ్లాక్ ఫ్రైడే పేరుతో ఆఫర్లను ప్రకటించారని తెలుస్తుంది. తరువాత కాల క్రమేణ ఇది అన్ని వ్యాపార దుకాణాలకు ఆనవాయితీగా మారింది. ప్రస్తుతం చాలా కంపెనీలు తమ బ్లాక్ ఫ్రైడే డిస్కౌంట్‌లను ఆన్‌లైన్‌లో విస్తరించాయి, ఇంటర్నెట్ షాపర్‌లను ఆకర్షించడానికి సైబర్ వీక్ డీల్‌లను అందిస్తు న్నాయి. ఇప్పుడు పరిస్థితి ఏమిటంటే, చిన్న నుండి చిన్న..పెద్ద నుండి పెద్ద రిటైలర్లందరూ తమ కస్టమర్లకు థాంక్స్ గివింగ్ కోసం బ్లాక్ ఫ్రైడే అనే పదాన్ని ఉపయో గించడం ప్రారంభించారు. ఇవే కాకుండా ఇప్పుడు అమెరికా, యూరప్ లకే పరిమితం కాకుండా ప్రపంచంలోని అనేక ప్రాంతాలకు చేరుకుంది.

## తెలంగాణలోని ఈ మూడు జిల్లాల్లో కొత్త ఎయిర్ పోర్టులు



**హైదరాబాద్ పెన్ పవర్:**వరంగల్‌తోపాటు మరో మూడు చోట్ల ఎయిర్‌పోర్టులు మంజూరు చేయాలని, వెంటనే పనులు ప్రారంభించాలని కేంద్ర ప్రభుత్వాన్ని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి అన్ని రకాల చర్యలు చేపడ్తున్నామని, కేంద్రం కూడా సహకరించాలని, అనుమతులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

**పాల్వంచ, అంతర్గాం, ఆదిలాబాద్‌లోనూ..!**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఎయిర్ పోర్ట్ ఏర్పాటుకు గతంలో గుర్తించిన స్థలం అనువుగా లేనందున ప్రత్యామ్నాయంగా పాల్వంచలో 950 ఎకరాలు గుర్తించామని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు దృష్టికి సీఎం రేవంత్‌రెడ్డి తీసుకెళ్లారు. ఆ భూమి వివరాలు ఏఏఐకి అందజేశామని, వెంటనే విమానాశ్రయ ఏర్పాటుకు అనుమతులు ఇవ్వాలని కోరారు. పెద్దపల్లి జిల్లాలో గతంలో గుర్తించిన భూమి ఎయిర్ పోర్ట్ నిర్మాణానికి అనువుగా లేదని ఏఏఐ ప్రీ–ఫీజుబిలిటీ సర్వేలో తేలిందన్నారు. ఇందుకు ప్రత్యామ్నాయంగా రాష్ట్ర ప్రభుత్వం అంతర్గాంలో 591.24 ఎకరాలు గుర్తించిందని, అక్కడ ఎయిర్ పోర్ట్ ఏర్పాటుకు పర్మిషన్ ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఆదిలాబాద్‌లో భారత వైమానిక దళం (ఐఏఎఫ్) ఆధ్వర్యంలో ఇప్పటికే 369.50 ఎకరాల భూమి ఉందని, పూర్తి స్థాయి కార్యకలాపాలకు అదనంగా 249.82 ఎకరాలు అవసరమని చెప్పారు. అదనంగా అవసరమైన భూమి సేకరించి అప్పగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. గిరిజనులు ఎక్కువగా ఉన్న ఆదిలాబాద్ కు వెంటనే ఎయిర్‌పోర్ట్ మంజూరు చేయాలని కేంద్ర మంత్రికి సీఎం విజ్ఞప్తి చేశారు. సీఎం వెంట ఎంపీలు చామల కిరణ్ కుమార్ రెడ్డి, కె.రఘువీర్ రెడ్డి, ఎం.అనిల్ కుమార్ యాదవ్, ఆర్.రఘురామిరెడ్డి, కడియం కావ్య కూడా ఉన్నారు.

## వారంలో మూడుసార్లు భోజనం వికటిస్తే ఏం చేస్తున్నట్టు

**హైదరాబాద్ పెన్ పవర్:** నారాయణపేట జిల్లా మాగనూర్ జడ్పీ హైస్కూల్‌లో ఫుడ్ పాయిజన్ ఘటనపై హైకోర్టు సీరియస్ అయ్యింది. మధ్యాహ్న భోజనంలో నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని దాఖలైన పిటిషన్‌పై న్యాయస్థానం ఇవాళ విచారణ చేపట్టింది. పిల్లలు చనిపోతే కానీ స్పందించరా? అని ప్రభుత్వాన్ని నిలదీసింది. అధికారులు నిద్రపోతున్నారా? అని ప్రశ్నించింది.

వారంలో మూడు సార్లు భోజనం వికటిస్తే అధికారులు ఏం చేస్తున్నారని మండిపడింది. స్కూల్‌లో ఫుడ్ పాయిజన్ చాలా సీరియస్ అంశమని పేర్కొంది. అధికారుల నిర్లక్ష్యానికి ఇది నిదర్శనమంది. వారంలో కౌంటర్ వేస్తామన్న ప్రభుత్వ న్యాయవాదిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. వివరాల సేకరణకు వారం రోజులు ఎందుకని నిలదీసింది. ఆదేశాలు ఇస్తే కానీ అధికారులకు పనిచేయడం చేతకాదా? అంటూ ఘాటు వ్యాఖ్యలు చేసింది. నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేస్తే ఐదు నిమిషాల్లో హాజరవుతారని చెప్పింది. ఆఫీసర్లకు కూడా పిల్లలున్నారని.. మానవతా దృక్పథంతో వ్యవహరించాలని సూచించింది. భోజన విరామం తర్వాత పూర్తి వివరాలు తమకు సమర్పించాలని ఆదేశించింది.

## కాంగ్రెస్ నేతల మధ్య ఎలాంటి విభేదాల్లేవు: భట్టి విక్రమార్క

- మంత్రివర్గ విస్తరణ విషయమై పార్టీ అధిష్ఠానం నిర్ణయం తీసుకుంటుందని వెల్లడి
- ప్రతిపక్షాల పసలేని విమర్శలతో ఎలాంటి ప్రయోజనం లేదని వ్యాఖ్య
- మూసీ నిర్వాసితులు వ్యాపారం చేసుకోవడానికి రుణ సదుపాయం కల్పిస్తామని హామీ



హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణలో కాంగ్రెస్ నేతల మధ్య ఎలాంటి విభేదాలు లేవని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అన్నారు. తమలో విభేదాలు అంటూ పసలేని విమర్శలు చేస్తే ప్రతిపక్షాలకు ఎలాంటి ప్రయోజనం ఉండదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తోన్న అభివృద్ధిని చూసి ఓర్వలేక కొంతమంది కాకుల్లా అరుస్తున్నారని విమర్శించారు. మంత్రివర్గ విస్తరణ విషయమై పార్టీ అధిష్ఠానం నిర్ణయం తీసుకుంటుందన్నారు. కాగా, మూసీ నిర్వాసితులు వ్యాపారాలు చేసుకోవడానికి రుణ సదుపాయం కల్పిస్తామని భట్టి విక్రమార్క వెల్లడించారు. హైడ్రా, మూసీ విషయంలో పూర్తిగా ఆలోచించాకే ముందుకు పోతున్నామన్నారు. మూసీ ప్రాజెక్టు విషయంలో హైకోర్టు ఇచ్చిన తీర్పును తాము స్వాగతిస్తున్నామన్నారు. ధరణి పోర్టల్‌ను అడ్డుపెట్టుకొని బీఆర్ఎస్ నేతలు వేలాది ఎకరాలు కాజేశారన్నారు. బీఆర్ఎస్ నేతలు కాజేసిన భూముల వివరాలను బయటకు తీస్తామన్నారు.

## నకిలీ యాంటిబయాటిక్స్ గుట్టు రట్టు

హైదరాబాద్ పెన్ పవర్:నకిలీ యాంటీబయాటిక్స్ ని డ్రగ్ కంట్రోల్ బ్యూరో పట్టుకుంది. నిందితులు ప్రముఖ కంపెనీ పేరుతో నకిలీ యాంటీబయాటిక్ తయారు చేస్తున్నారు. కోటిన్నర రూపాయల విలువచేసే నకిలీ యాంటీబయాటిక్ స్వాధీనం చేసుకున్నారు. జోడాస్ ఎక్స్పో ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో బయోటిక్స్ తయారీ అవుతోంది. నకిలీ యాంటీబయాటిక్స్ ని ప్రముఖ కంపెనీలకు జోడాస్ సరఫరా చేస్తుంది. నకిలీ యాంటీబయాటిక్స్ని రక్షా కూడా సరఫరా చేస్తున్నట్లు గుర్తించారు.

## దంపతుల హత్య

హైదరాబాద్ పెన్ పవర్:నేలకొండపల్లి లో భార్యాభర్తలను గుర్తు తెలియని దుండగులు హత్య చేశారు. రమణ,కృష్ణ కుమారి అనే భర్త,భార్యలను వారి ఇంట్లో నే చంపి ఇంటి చుట్టూ కారం చల్లారు. పిల్లలు హైదరాబాద్ లో ఉంటుండగా భార్య,భర్త నేలకొండపల్లి లో ఉంటున్నారు. డబ్బు,నగల కోసమే హత్య జరిగి ఉంటుందని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

## దిలావర్ పూర్ లో కొనసాగుతున్న ఉద్రిక్తత

హైదరాబాద్ పెన్ పవర్: దిలావర్పూర్, గుండంపల్లి గ్రామాల్లో బుధవారం ఉదయం కూడా అరెస్టులు కొనసాగాయి. మంగళవారం ఆందోళన చేసిన వారిని గుర్తించి అరెస్టు చేసేందుకు పోలీసులు వెళ్లారు.. గ్రామస్థులు పోలీసులను అడ్డుకున్నారు. ఇప్పటికే పలువురిని అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఇతనల్ బాధిత గ్రామాల్లో ఉద్రిక్తత కొనసాగింది.

# కరీంనగర్ హనుమాన్ ఆలయంలో పంచలోహ విగ్రహాలు చోరీ

హైదరాబాద్ పెన్ పవర్:ఈ మధ్య హిందూ దేవాలయాలు టార్గెట్ గా దాడులు కలకలం రేపుతున్నాయి. లేటెస్ట్ గా కరీంనగర్ జిల్లా కోతి రాంపూర్ హనుమాన్ దేవాలయంలో చోరీ జరిగింది. తాళం పగలగొట్టి పంచలోహ విగ్రహాలను ఎత్తుకెళ్లారు దొంగలు. ఘటనా స్థలానికి వచ్చిన పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సీసీ కెమెరాల ద్వారా దొంగలను పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.




మీర్ పేటలో నవంబర్ 18న మీర్‌పేట్ టీచర్స్ కాలనీలో నిర్మాణంలో ఉన్న ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో గుర్తు తెలియని వ్యక్తులు పంచలోహ విగ్రహాలను ఎత్తుకెళ్లిన సంగతి తెలిసిందే.. ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో శనివారం కొందరు అయ్యప్ప భక్తులు, అయ్యప్ప స్వామి, గణపతి స్వామి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి పంచలోహ విగ్రహాలను గుడిలో తాత్కాలికంగా ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. అనంతరం రాత్రి 12 గంటల సమయంలో అయ్యప్ప స్వాములు దేవాలయం నుంచి వెళ్లిపోయారు. తాత్కాలికంగా ఏర్పాటు చేసిన దేవతామూర్తుల వద్ద పూజారి తో పాటు వంట పని చేసే వాళ్లు దేవాలయాన్ని శుభ్రం చేసే వారు నిద్రపోయారు. ఆదివారం తెల్లవారుజామున నిద్రలేచేసరికి పంచలోహ విగ్రహాలు కనిపించలేదు. వెంటనే వారు ఆలయ చైర్మన్ కు ఫిర్యాదు చేశారు

**శంషాబాద్ లో**

నవంబర్ 5న శంషాబాద్ ఎయిర్ పోర్ట్ కాలనీలోని హనుమాన్ దేవాలయంపై గుర్తు తెలియని దుండగులు దాడి చేశారు . దేవాలయంలోని నవగ్రహాల విగ్రహాలను గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు

**సికింద్రాబాద్ లో**

అక్టోబర్ 14న సికింద్రాబాద్ లోని ముత్యాలమ్మ ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేశారు. గర్భగుడి నుంచి విగ్రహాన్ని బయట విసిరేశారు. ఈ ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే..

# ఒవైసీ బ్రదర్స్ సువిశాల నిర్మాణాల్ని మాత్రం రేవంత్ రెడ్డి కూల్చడం లేదు: బీజేపీ నేత

- హైడ్రా పేరుతో పేద, మధ్య తరగతి వారి ఇళ్లను కూల్చేస్తున్నాడని విమర్శ
- హైడ్రా, మూసీ ప్రక్షాళన, ఫార్మా పేరుతో భూములు లాక్కుంటున్నారని ఆరోపణ
- మూసీ కంటే ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలని సూచన



హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పేద, మధ్యతరగతి వర్గాల ఇళ్లను కూల్చేస్తున్నాడని, కానీ కాంగ్రెస్ ఉన్నత వర్గం, వారి బీఆర్ఎస్ మిత్రపక్షం, ఒవైసీ సోదరుల విశాలమైన అక్రమ నిర్మాణాలను, రాజభవనాల వంటి ఫాంహౌస్‌లను మాత్రం కూల్చడం లేదని మాజీ ఎంపీ, బీజేపీ నేత బూర నర్సయ్య గౌడ్ విమర్శించారు. హైడ్రా, మూసీ ప్రక్షాళన, భూసేకరణ, రహదారుల పేరుతో ఫార్మా కంపెనీల పేరుతో భూములు లాక్కుంటున్నారని మండిపడ్డారు.మూసీ ప్రక్షాళనకు బీజేపీ వ్యతిరేకం కాదని, కానీ నిర్వాసితులకు న్యాయం జరగాలన్నదే తమ ఉద్దేశమన్నారు. రాష్ట్రంలో ప్రజలు బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు కోసం ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారని, అసెంబ్లీ ఎన్నికలు ఎప్పుడు జరిగినా బీజేపీని గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ మూసీ ప్రక్షాళన చేపట్టినా దానిని పూర్తి చేసేది మాత్రం తమ బీజేపీ ప్రభుత్వమేనని వ్యాఖ్యానించారు.

అయితే మూసీ ప్రక్షాళన కంటే ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సూచించారు. కులగణన నివేదిక రాగానే బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్నారు. వివిధ రాష్ట్రాల్లో వరుస ఎన్నికల్లో బీజేపీ విజయం సాధిస్తోందన్నారు. హర్యానా, మహారాష్ట్రల్లో బీజేపీ సర్వేలకు భిన్నంగా విజయం సాధించిందన్నారు. ఝార ఐడ్, జమ్ము కశ్మీర్‌లలో తమకు ఓటు బ్యాంకు పెరిగిందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఆయా రాష్ట్రాలలో 50 సీట్లు కూడా గెలవలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ, రాహుల్ గాంధీ నాయకత్వంపై ప్రజలకు విశ్వాసం లేదని విమర్శించారు.రేవంత్ రెడ్డి డిమోలిషన్ మ్యాన్ అని, అంటే కూల్చివేతల మనిషి అని బూర నర్సయ్య గౌడ్ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక తెలంగాణ పరిస్థితి పెనం నుంచి పొయ్యి మీద పడినట్లయిందని వ్యాఖ్యానించారు. హిమాచల్ ప్రదేశ్, కర్ణాటక, తెలంగాణలలో గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి... ప్రజలను మోసం చేసిందన్నారు.

# పెద్ద కల్వలలో నిరుద్యోగ విజయోత్సవ సభ

## ముఖ్యమంత్రి పర్యటనకు సభ నిర్వహణ స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్



**హైదరాబాద్ పెన్ పవర్:**నిరుద్యోగ యువతతో వచ్చే నెల 4న పెద్దపల్లిలో జరుగునున్న విజయోత్సవ సభను ఏర్పాటు చేయాడానికి పెద్ద కల్వలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలాన్ని గుర్తించినట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ ముఖ్యమంత్రి సభ నేపథ్యంలో స్థలాన్ని శుభ్రం చేయాలని, రేపు ఉదయం స్టేజ్ ఏర్పాటు కోసం హైదరాబాద్ నుంచి బృందం వస్తుందని అన్నారు. డిసెంబర్ 4న పెద్దపెల్లి జిల్లాలో నిరుద్యోగ యువతతో విజయోత్సవ సభ జరగనుందని అన్నారు. ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు మాట్లాడుతూ నిరుద్యోగ విజయోత్సవ సభకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరు కానున్నారని, ఈ సభలో గ్రూప్ 4, ఇతర వివిధ పోటీ పరీక్షలకు కింద ఎంపికైన 9 వేల మది అభ్యర్థులకు ఉద్యోగ నియామక పత్రాలను పంపిణీ చేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో సభ నిర్వహణకు పెద్ద కల్వలోనే ఖాళీ స్థలాన్ని ఎంపిక చేసినట్లు తెలిపారు. జిల్లాలో ఉన్నతాధికారులు అప్రమత్తంగా ఉంటూ ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం చేసేందుకు పక్కా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి బి.గంగయ్య, మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, తహసిల్దార్ రాజ్ కుమార్, ఆర్ అండ్ బి ఈఈ భావ్ సింగ్ తోపాటు సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎర్ర చందనం అమ్మకాలు, ఎగుమతికి సింగిల్ విండో విధానం మేలు



**హైదరాబాద్ పెన్ పవర్:**ఎర్రచందనం అమ్మకాలు, ఎగుమతుల ప్రక్రియను సింగల్ విండో విధానానికి మార్చాలని, దీని ద్వారా అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించే 'ఈ ? వేలం'లో మెరుగైన ఫలితాలు వస్తాయని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్ కి తెలియచేశారు. దేశ రాజధాని ఢిల్లీలో పర్యటిస్తున్న పవన్ కళ్యాణ్ బుధవారం ఉదయం భూపేంద్ర యాదవ్ తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎర్రచందనం రక్షణ, స్మగ్లింగ్ నిరోధం, దుంగల అమ్మకం విషయంలో అనుసరిస్తున్న విధానాల మీద కేంద్ర మంత్రితో చర్చించారు.

పవన్ కల్యాణ్ కేంద్ర మంత్రి దృష్టికి ఈ విషయాలు తీసుకువచ్చారు. "బొటానికల్ సర్వే ఆఫ్ ఇండియా ఇటీవల ప్రతిపాదించిన ప్రకారం ఎర్రచందనం అమ్మకం, ఎగుమతి చేసే విషయంలో సింగిల్ విండో విధానం ఉంటే మేలు జరుగుతుంది. ఈ విధానానికి ఆంధ్రప్రదేశ్ అటవీశాఖ కస్టోడియన్ గా వ్యవహరిస్తుంది. ఈ ప్రతిపాదనను పరిశీలించలరు. ఆంధ్రప్రదేశ్ అటవీశాఖ ఆధ్వర్యంలో ఎర్రచందనం గ్రేడింగ్, వేలం, ఎగుమతి సాగిస్తుంది. తద్వారా ఈ-వేలం ద్వారా రెవెన్యూ పెరుగుతుంది.

**ఏ రాష్ట్రంలో పట్టుబడినా...**

ఎర్రచందనం అరుదైన వృక్ష సంపద. ఆంధ్ర ప్రదేశ్ అటవీ ప్రాంతంలోనే పెరుగుతుంది. ఈ క్రమంలో కేంద్రం నిబంధనలను సవరించి ఆంధ్రప్రదేశ్ వెలుపల పట్టుబడిన ఎర్రచందనం సైతం సింగిల్ విండో వేలంలో భాగం కస్టోడియన్ గా ఉండే ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికే దక్కేలా చూడాలి. దీనివల్ల ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం పట్టుబడిన ఎర్రచందనం అమ్ముకోవడానికి కుదరదు. అమ్మకాలు, ఎగుమతులు ఒకే విధానం ద్వారా కొనసాగుతుంది. కేంద్ర పర్యవేక్షణతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కస్టోడియన్ గా కొనసాగుతుంది" అని పవన్ కల్యాణ్ వివరించారు.

## హరీష్ రావు నిజాయితీ నిరూపించుకో సిద్దిపేట జిల్లా వాసులు




**హైదరాబాద్ పెన్ పవర్:**ఒక్క గుంట కూడా భూమిని కబ్జా చేయలేదని ప్రగడ్బాలు పలుకుతున్న మాజీ మంత్రి హరీష్ రావు తన నిజాయితీని నిరూపించుకోవాలని సిద్దిపేట జిల్లా వాసులు న్యాయవాది జెల్లా రవీందర్ యాదవ్, అశోక్, రమేష్ డిమాండ్ చేశారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సిద్దిపేట లో హరీష్ రావు రాజ్యాంగం ఇప్పటికి కొనసాగుతూనే ఉందని ఆరోపించారు. సిద్దిపేటలో అభివృద్ధిలో దూసుకుపోతుందని వస్తున్న వార్తల్లో నిజం లేదని అన్నారు. అభివృద్ధి మాటున అరాచకాలు ఎన్నో కొనసాగుతున్నాయని అన్నారు. రంగనాయక సాగర్ రిజర్వాయర్ నిర్మాణం సందర్భంగా ఇరిగేషన్ శాఖ అధికారులతో స్థానిక రైతులను భయభ్రాంతులకు గురిచేసి వారి వద్ద నుంచి ఎకరాల కొద్ది భూమిని కొనుగోలు చేశారని ఆరోపించారు. నేరుగా రంగనాయక సాగర్ కోసం సేకరించిన భూమి నుంచి 9 గుంటల భూమిని అక్రమంగా తన పేరును రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఆరోపించారు. సప్త సముద్రాలు ఈదిన వాడు పిల్ల కాలువలో పడి కొట్టుమిట్టాడినట్లుగా ప్రస్తుతం 9 గుంటల భూమి హరీష్ రావు నిజాయితీని ప్రశ్నిస్తుందని అన్నారు. తాను ఒక్క గుంట భూమిని కూడా కబ్జా చేసుకోలేదని చెబుతున్న హరీష్ రావు కు సిబిడి ఎంక్వయిరీ కోరే దమ్ముందా అని ప్రశ్నించారు. దీంతోపాటు సిద్దిపేట అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (సుడా) పేరిట జరిగిన అక్రమాలు ఎన్నో ఉన్నాయని ప్రస్తుత ప్రభుత్వం వాటిని సమగ్రంగా విచారణ జరిపి వెలికి తీయాలని కోరారు.

### ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో సిసి రోడ్లు

## డ్రైనేజ్ కాలువలు నిర్మాణ పనులు

**హైదరాబాద్ పెన్ పవర్:**కౌతాళంరాష్ట్ర ప్రభుత్వం మరియు ఎమ్మెల్యే .బాలనాగి రెడ్డి ఆదేశాల మేరకు కౌతాళం మండలం కౌతాళం గ్రామం వైయస్ఆర్ నగర్ నందు ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో మండల నాయకులు దేశాయ్ ప్రహ్లాద్ ఆచారి వారి ఆధ్వర్యంలో సీసీ రోడ్డు మరియు డ్రైనేజీ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ యస్.పాల్ దినకర్ ,వైస్ ఎంపిపి బుజ్జీ స్వామి, ఉప సర్పంచ్ సక్కరి తిక్కయ్య,మాజీ చైర్మన్ వడ్డే రామన్న, మాజీ సర్పంచ్ అవతారం, నాయకులు సత్యప్ప స్వామి, ఉమాపతి, సమ్మద్,వార్డ్ మెంబర్ రామకృష్ణ, వెంకట రామ రాజు, షేక్షవలి, తదితరులు పాల్గొన్నారు.

## వీహెచ్ ఇంటి దగ్గర కలకలం

## కారుపై రాళ్లు రువ్విన దుండగులు

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు ఇంటి దగ్గర రాళ్ల దాడి కలకలం రేపింది. హైదరాబాద్‌లోని డీడీ కాలనీలోని ఆయన ఇంటి ముందు పార్క్ చేసిన కారుపై రాళ్ల దాడి జరిగింది. మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఈ దాడికి పాల్పడినట్లుగా తెలుస్తోంది. దాడి సమయంలో వీహెచ్ ఇంట్లోనే ఉన్నారు. ఈ ఘటనపై పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అక్కడికి చేరుకుని పరిశీలించారు.

## కడప ఎస్పీకి ఘాటుగా లేఖ వ్రాసిన తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే జేసి ప్రభాకర్ రెడ్డి..



**హైదరాబాద్ పెన్ పవర్:**ఆర్టీపీపీలో ఫ్లయాష్ తీసుకెళ్లేందుకు వెళ్లిన జేసీ ప్రభాకర్‌రెడ్డి వాహనాలను ఆదినారాయణరెడ్డి వర్గీయులు అడ్డుకున్నారని జేసీ ప్రభాకర్‌రెడ్డి మండిపడుతున్నారు.జేసీ ప్రభాకర్ రెడ్డి కడప ఎస్పీకి వ్రాసిన లేఖలో ఆర్టీపీపీలో ఫ్లైయాష్ తీసుకెళ్లేందుకు మా వాహనాలను ఆదినారాయణరెడ్డి అన్న కుమారుడు భూపేష్‌రెడ్డి వర్గీయులు అడ్డుకున్నారు. అయినా మేం సంయమనం పాటించాం..వాళ్లు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుంటున్నారు. అందుకే వైఎస్సార్ జిల్లా నుంచి వచ్చే సిమెంట్, ఇసుక వాహనాలను మేమూ అడ్డుకున్నాం. మీరు కోరిన మీదట వాటిని నడవడానికి అనుమతించాం. మా వాహనాలను అడ్డుకోకూడదని మేం కోరాం..అయినా పరిస్థితి మారలేదు. మేం ఆర్టీపీపీకి వాహనాలను పంపుతున్నాం..వాళ్లు ఆపితే మేం అంత ఈజీగా తీసుకోం. ఇటీవల వారు అదానీ సంస్థపై కూడా ఎటాక్ చేశారు. మేం అలాంటి వాళ్లం కాదు. రేపు మా వాహనాలను అడ్డుకుంటే మాత్రం వారి వేదింపులను సహించేది లేదు. తప్పకుండా సరైన సమాధానం చెప్తాం అంటూ కడప ఎస్పీకి లేఖ వ్రాశారు.

## దైద అమరలింగేశ్వరస్వామి పూజలో ఎమ్మెల్యే యరపతినేని




**హైదరాబాద్ పెన్ పవర్:**గురజాల శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు బుధవారం గురజాల మండలం దైద అమరలింగేశ్వర స్వామి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ, కృష్ణానది ఒడ్డున సహజ సిద్ధంగా కొండబిలం లోపల వెలసిన అమర్ లింగేశ్వర స్వామి ఎంతో మహిమాన్వితుడని అన్నారు. పల్నాడు జిల్లాలో దైదను ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు దేవాలయం వద్ద పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో యరపతినేని శ్రీనివాసరావు తో పాటు తెలుగుదేశం, జనసేన, బిజెపి, పార్టీలకు చెంది వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నేనేమీ వణికిపోవడం లేదు.. కేసులకు భయపడటం లేదు..

**ఆర్జీవీ సంచలన వీడియో!**

**ప్రస్తుతం సినిమా పనిలో బిజీగా ఉండడంతోనే విచారణకు రాలేదని వివరణ**



**హైదరాబాద్ పెన్ పవర్:**తన కోసం ఏపీ పోలీసులు గాలించడంపై వివాదాస్పద దర్శకుడు రామ్ గోపాల్ వర్మ తాజాగా ఓ సంచలన వీడియో విడుదల చేశారు. పోలీసుల నోటీసు లకు తాను ఏడవడం లేదని, వణికిపోవడం లేదని చెప్పారు. తాను సోషల్ మీడియాలో పెట్టిన పోస్టులు ఎవరి మనోభావాలో దెబ్బతీశాయట అంటూ వ్యంగ్యంగా మాట్లాడారు.తాను పోస్టు పెట్టిన వారికి కాకుండా.. ఇంకెవరో మనోభావాలు దెబ్బతింటే ఈ కేసులు, సెక్షన్లు ఎలా వర్తిస్తాయని ఆర్జీవీ ప్రశ్నించారు. ప్రస్తుతం ఓ మూవీ షూటింగ్లో ఉన్నానని, నిర్మాతకు నష్టం వస్తుందనే విచారణకు రాలేకపోతున్నట్లు ఆయన తెలిపారు. అయితే, తనకు వచ్చిన నోటీసులకు తాను సమాధానం ఇచ్చానని రామ్ గోపాల్ వర్మ గోపాల్ వర్మ చెప్పుకొచ్చారు.


ఇదిలాఉంటే.. సోషల్ మీడియా వేదికగా అప్పటి ప్రతిపక్షనేత చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేశ్, పవన్ కల్యాణ్పై ఆర్జీవీ అసభ్యకర పోస్టులు పెట్టారంటూ ఏపీలో ఆయనపై కేసు నమోదైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే వర్మకు ఒంగోలు పోలీసులు విచారణకు రావాల్సిందిగా నోటీసులు ఇచ్చారు. రెండుసార్లు విచారణకు డుమ్మా కొట్టిన ఆర్జీవీని అదుపులోకి తీసుకోవడానికి పోలీసులు ఆయన ఇంటికి వెళ్లారు. కానీ, ఆయన ఇంటి నుంచి అదృశ్యమయ్యారు. వర్మ ఇంట్లో లేకపోవడంతో పోలీసులు వెనుతిరిగారు. ప్రస్తుతం ఆయన కోసం పోలీసులు గాలిస్తున్నారు.

# క్యాన్సర్ పేషంట్ కు ఆర్థిక సహాయం

**హైదరాబాద్ పెన్ పవర్::**అధైర్యపడకుండా సరైన వైద్యం తీసుకుంటే ఏలాంటి క్యాన్సర్ నైనా జయించవచ్చని డాక్టర్ కిరణ్ కుమార్ తెలిపారు. అంబర్పేట్ వెంకట్ రెడ్డి నగర్ కు చెందిన కిరణ్మయి గత కొంత కాలంగా క్యాన్సర్ తో బాధపడుతూ,ఆర్థిక ఇబ్బందుల్లో ఉంది.అది గమనించి డిడి కాలానికి చెందిన భారతి చంద్రశేఖర్ ఎస్ సి ఎస్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రెండు లక్షల ఆర్థిక సహాయం అందించి వైద్యం చేయించారు.క్యాన్సర్ వచ్చింది అని భయపడకుండా

ధైర్యంతో ఉండి సరైన వైద్యం తీసుకున్నట్లయితే జయించవచ్చని, మీకు, మీ చుట్టుపక్కల ఎవరికైనా క్యాన్సర్ వచ్చినట్లయితే వారికి ధైర్యం చెప్పి తోచిన ఆర్థిక సహాయం అందించాలి అని పేషంట్ కిరణ్మయి కోరారు. నాకు ఆర్థిక సహాయం అందించిన భారతి చంద్రశేఖర్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ క్యాన్సర్ వస్తే చనిపోతారు అని సరైన వైద్యం తీసుకోకుండా ఉంటారు.అదితప్పు కిరణ్మయి క్యాన్సర్ వచ్చింది అని గమనించి సరైన వైద్యం తీసుకున్నారు.ఈ క్యాన్సర్ వాళ్ళ తల్లికి కూడా ఉంది ఆమె సరైన వైద్యం తీసుకొని ఈరోజు తన కూతురిని ఆమె తీసుకొచ్చి వైద్యం చేయిస్తూ ఇద్దరు ఆరోగ్యంగా ఉన్నారు.

# రైతును రాజును చేసే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిది...



**హైదరాబాద్ పెన్ పవర్:**షాద్ నగర్ నూతన వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణస్వీకార కార్యక్రమానికి ముఖ్య అథితిగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావ్, స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ..కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. మంత్రి తుమ్మల ఆధ్వర్యంలో మార్కెట్ కమిటీ నూతన ఛైర్మెన్ సులోచన తో పాటు డైరెక్టర్లకు ప్రమాణ స్వీకారం చేశారు.అనంతరం సభలో మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావ్ మాట్లాడుతూ..... ధనిక రాష్ట్రమైన తెలంగాణ బి ఆర్ ఎస్ అప్పుల పాలు చేసిందన్నారు. ఇంత అప్పులో ఉన్నా కూడా 47 వేల కోట్లు వ్యవసాయ రంగానికి కేటాయించమన్నారు. 22 లక్షల మందికి 18 వేల కోట్లు రైతుల ఖాతాల్లో వేసామన్నారు. తెల్ల రేషన్ కార్డు లేని, వివిధ టెక్నీకల్ ప్రాబ్లమ్స్ వల్ల ఆగిపోయిన సుమారు 3 లక్షల మంది రైతులకు మహబూబ్ నగర్ లో జరగబోయే రైతు పండగ రోజు రుణ మాఫీ వేస్తామన్నారు. సన్న రకం పందిస్తున్న రైతులకు క్వింటాలుకు 500 బోనస్ ఇస్తామన్నారు. తెలంగాణ బియ్యం బయటి దేశాల వారు కోరుకుంటున్నారన్నారు. రంగారెడ్డి జిల్లాకు ఇరిగేషన్ కల్పిస్తామన్నారు. మహబూబ్ నగర్, రంగారెడ్డి జిల్లాలకు ఎలాంటి ప్రాజెక్ట్ అయినా ఎక్కువే కేటాయిస్తామన్నారు. రైతును రాజునూ చేసే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిది అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన అన్నీ హామీలు నెరవేరుస్తామన్నారు. బి ఆర్ ఎస్ ప్రభుత్వం ప్రతి వ్యవస్థలో అవినీతి ఉండేదన్నారు. రంగారెడ్డి జిల్లా ప్రాంతంలో ఒక అతి పెద్ద మార్కెట్ ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే నూతనంగా కొందుర్గు మండలానికి మార్కెట్ కమిటీ ఏర్పాటు చేస్తామన్నారు. ఖీఖీఖీ వస్తే షాద్ నగర్ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. పాలమూరు ఉమ్మడి జిల్లా కు సంబంధించిన అందరి రైతుల సమస్య లను దృష్టి లో పెట్టుకుని ఇక్కడే ఒక మోడల్ మార్కెట్ ను ఏర్పాటు చేసి అందులోనే కోల్డ్ స్టోరేజ్ లను ఏర్పాటు చేసి విదేశాలకు ఇక్కడి నుంచే కూరగాయలు ఎగుమతి చేసే దిశగా చేస్తామని హామీ ఇచ్చారు